క్లుప్తంగా

స్వీపర్ ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలి



కార్యాలయం వద్ద గ్రామస్తులు

కొండగట్టు: కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి వారి ఆలయంలో స్వీపర్ ఉద్యోగాలు ముత్యంపేట తమకే ఇవ్వాలని గ్రామస్తులు ఆదివారం ఆలయ సూపరింటెండెంట్ సునీల్‌కు వినతిపత్రం అందించారు. ఇటీవల వివిధ విభాగాలకు సంబంధించిన 15 మందిని ఆదిత్య ఏజెన్సీ హైదరాబాద్ ద్వారా ఉద్యోగాల్లోకి తీసుకున్నారని, తాము ఏళ్లుగా ఆలయం వద్ద విధులు నిర్వహిస్తున్నామని, తమకే స్వీపర్ ఉద్యోగాలు కేటాయించాలని కోరారు. వారి వెంట సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి ఉన్నారు.

ఆటో యూనియన్‌కు డ్రైవింగ్ లైసెన్స్‌లు



లైసెన్సులు పంపిణీ చేస్తున్న చైర్మన్

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహ ఆటో యూనియన్ సభ్యులకు ఆదివారం ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సులను పంపిణీ చేశారు. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతో మంజూరు చేసిన లైసెన్సులను డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి చేతుల మీదుగా స్థానిక గాంధీ విగ్రహం వద్ద అందజేశారు. ఈసందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు గాడిచర్ల తిరుపతి, గౌరవ అధ్యక్షుడు గరిగె శంకర్, లోకల్ ఇన్‌చార్జి అశోక్, ఉపాధ్యక్షుడు వీరవేణి కొమురయ్య, రాజు తదితరులున్నారు.

ముత్యంపేటలో స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే



సర్వే చేస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం

మల్యాల: మండలంలోని ముత్యంపేటలో ఆదివారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కేంద్రం బృందం ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి, యజమాని పేరు, ఫోన్ నంబర్, వృత్తి, టాయిలెట్ సింగిల్ ఫిట్టింగా, డబల్ ఫిట్టింగా వంటి అంశాలపై సర్వే చేపట్టారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా చెత్తా సేకరిస్తున్నారా, తడి, పొడి చెత్త వేరు చేస్తున్నారా అని పరిశీలించారు. గ్రామ పంచాయతీ భవనం, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం సభ్యులు ప్రవళిక, ఎంపీడీవో వెంకటేశం, ఎంపీవో వాసవి, సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, ఉప సర్పంచ్ కొండబత్తిని త్రినాథ్, ఎస్‌బీఎం హరిణి, కార్యదర్శి స్వప్న పాల్గొన్నారు.

గొడుగులు అందజేత



గొడుగు అందజేస్తున్న నవీన్‌రావు

మెట్‌పల్లి: పట్టణంలోని వెల్లుల్ల, చావిడి మార్గాల్లో రహదారుల పక్కన కూరగాయలు విక్రయించే రైతులు, వ్యాపారులకు ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్‌కుమార్ గొడుగులు అందజేశారు. ఈ సందర్భంగా ఎండకు, వానకు ఇబ్బందులు పడుతున్న తమకు గొడుగులు అందజేయడం పట్ల రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్, పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్, మద్దెల లావణ్య, దొనికెల నవీన్, రమేష్, శ్రీకాంత్ తదితరులున్నారు.

జాబ్ మేళాలో 32 మందికి ఉద్యోగాలు

మెట్‌పల్లి: పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ కళాశాలలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన సిస్ టెక్ సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. దీనిలో 90 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, 32మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంతోష్‌తో పాటు ఉపన్యాసకులు ఉన్నారు.

చెరువులకు జలకళ

- చివరి దశలో వరి నాట్లు
- ఆయకట్టు భూములు సస్యశ్యామలం
- మండలంలో 28 వేల ఎకరాల్లో సాగు



మత్తడి దుంకుతున్న పెగడపల్లి చెరువు

పెగడపల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు మండల వ్యాప్తంగా చెరువుల్లో పూర్తి స్థాయి నీరు చేరి అలుగులు పారుతున్నాయి. ఇప్పటికే మండలంలోని దాదాపు 75 శాతం మంది రైతులు వరినాట్లు పూర్తి చేయగా మిగతా రైతులు నాట్లు వేసే పనిలో ఉన్నారు. వరుసగా నాలుగేళ్లుగా వర్షాలు కురుస్తూ చెరువులు, కుంటలు నిండుతుండటంతో చెరువులు జలకళ సంతరించుకుని బీడు భూములన్నీ సస్యశ్యామలంగా మారుతున్నాయి. గతంలో వర్షాలు లేని సమయంలో చుక్క నీరురాక ఆయకట్టు కింద ఉన్న వందలాది ఎకరాల భూములు బీళ్లుగానే ఉండేవి. ఐదేళ్లుగా ఈ పరిస్థితి లేదని ఆయకట్టు రైతులు పేర్కొంటున్నారు. చెరువులు, కుంటల కింద విరివిగా పంటల సాగు అవుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చెరువులు,కుంటల కింద 3 వేల ఎకరాల్లో సాగు

మండలంలో నిజాం కాలంలో నిర్మించిన 12 పెద్ద చెరువులు 72 కుంటలు ఉన్నాయి. సుమారు వీటి పరిధిలో సుమారు 2600 ఎకరాల మేరకు ఆయకట్టు ఉంటుంది. ఆయా గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటలు ప్రస్తుతం పూర్తి స్థాయిలో నిండు కోవడంతో ఆయకట్టు కింద ఉన్న కొందరు రైతులు ఇప్పటికే వరినాట్లు వేయగా, మరి కొందరు రైతులు నాట్లు వేసుకునేందుకు సన్నద్ధం అవుతున్నారు. ఆయకట్టుకు సంబంధించి మండలంలో లింగాపూర్ పెద్ద చెరువు కింద 320 ఎకరాలు ఉండగా, పెగడపల్లి యాపల్ చెరువు కింద 220 ఎకరాలు, నంచర్ల చెరువు కింద 150 ఎకరాలు, వెంగళాయిపేట చెరువు కింద 160 ఎకరాలు, మద్దులపల్లి చెరువు కింద 180 ఎకరాలు, ఎల్లాపూర్ చెరువు కింద 190 ఎకరాలు, బతికపల్లి చెరువు కింద 180 ఎకరాలు, దీకొండ చెరువు కింద 130 ఎకరాలు, కీచులాటపల్లి చెరువు కింద 140 ఎకరాలు, అయితిపల్లి చెరువు కింద 175 ఎకరాలు, వీటితో పాటు కుంటల కింద సుమారు 1200 ఎకరాలు వరకు ఆయకట్టుగా ఉంది. అయితే చెరువుల నిండా పూర్తి స్థాయిలో నీరు చేరడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువుల్లో పూడిక తీయడంతో పాటు కట్టలు పటిష్ట పరచటం, అలుగులు, తూములకు మరమ్మతులు, పంట కాలువల ఏర్పాటు వంటి పనులు చేపట్టారు. దీంతో చెరువుల్లో నీటి నిల్వ స్థాయి పెరిగింది. వీటితో పాటు వ్యవసాయ బావులు, ఎస్సారెస్పీ నీటి ఆధారంగా మండలం మొత్తంగా ఈ వానాకాలంలో 28 వేల ఎకరాల వరకు వరి పంట సాగు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు.

సాగుకు ఢోకా లేదు



మా చెరువులోకి నీళ్లు రావడంతో పంటల పండించుకునే అవకాశం వచ్చింది. గతంలో నీళ్లు లేక భూములు పడావుగా ఉండేవి. పంటలు పండక పోవడంతో పంటకు కనీసం రూ. 2 లక్షల వరకు నష్టపోయాం. మూడేళ్ల నుంచి వర్షాలకు చెరువు నిండి మత్తడి దుంకుతోంది.

– కాశెట్టి వీరేశం, లింగాపూర్

సంతోషంగా ఉంది



చెరువులు, కుంటలు నిండటంతో రైతులు సంతోషంగా ఉన్నారు. వానలతో పాటు ఎస్సారెస్పీ, కాళేశ్వరం జలాలతో చిన్ననీటి వనరులు జలకళ సంతరించుకుంటున్నాయి. రైతులు అనుకున్నట్లు పంటలు పండించుకునే అవకాశం కలిగింది. యాసంగి పంట నీటికి ఢోకా ఉండదు.

– అజ్మీరా భూమనాయక్, మద్దులపల్లి

అనుకూల వాతావరణం



ఈ నెలాఖరు వరకు వరినాట్లు వేసేందుకు అనుకూలం. సెప్టెంబర్ మొదటి వారంలో నాట్లు వేసే రైతులు కుదురుకు ఎక్కువ సంఖ్యలో మొక్కలు ఉండేలా నాట్లు వేయాలి. చెరువుల్లోకి పూర్తి స్థాయిలో నీరు చేరడం వరి పంట సాగుకు అనుకూలిస్తుంది.

– అశోక్, ఏఈవో, పెగడపల్లి

ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు ఘన నివాళి



జగిత్యాల వ్యవసాయ పరిశోధన స్థానంలో నివాళి



ధర్మపురిలో నివాళి అర్పిస్తున్న చైర్‌పర్సన్



సార్ చిత్రపటానికి పంచాయతీ కార్మికుల వినతి

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జయశంకర్ చిత్రపటానికి శాస్త్రవేత్తలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో..

తెలంగాణ రచయితల వేదిక జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల వద్ద జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

కథలాపూర్: మండల పరిషత్ కార్యాలయంలో, అన్ని గ్రామాల్లో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.

మేడిపెల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, ఏఎంసీ చైర్‌పర్సన్ రమ్య, ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్‌లో ప్రొ.జయశంకర్ చిత్రపటానికి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన నివాళి అర్పించారు.

ధర్మపురి : మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో చైర్మన్ అయ్యోరి రాజేశ్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రాయికల్: తెలంగాణ ఉద్యమ రథసారధి, ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఆదివారం రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని 32 గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు.

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో సమ్మెలో ఉన్న పంచాయతీ కార్మికులు ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘనంగా నివాళి అర్పించారు.

మెట్‌పల్లి: ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీఆర్‌ఎస్ కార్యాలయం, మనుయమ సంఘం, స్వర్ణకారం సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.

జగిత్యాల: జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పూలమాల వేసి నివాళి అర్పించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బీఎస్. లత, దివాకర్‌లతో పాటు, మున్సిపల్ చైర్మన్ గోళి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం కోసమే వైద్య శిబిరాలు



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహారావు

కథలాపూర్: గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించాలనే ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహరావు అన్నారు. ఆదివారం కథలాపూర్‌లో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు ఇంటింటికీ తిరిగి 1,575 మందికి పరీక్షలు చేశారన్నారు. ఇందులో 359 మంది వివిధ రకాల రోగాలతో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించామన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తే రాజకీయ లబ్ది అంటూ కొందరు విమర్శలు చేస్తున్నారని, ప్రజలకు సేవలందిచేవారిని ప్రోత్సహించడం నాయకుడి లక్షణమన్నారు. అని ఈ శిబిరంలో చికిత్స చేయించుకున్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కంటె నీరజ, నాయకులు మామిడిపెల్లి రవి, గసికంటి వేణు, దొప్పల జలంధర్, జవిడి ప్రతాప్‌రెడ్డి, ఏజీబీ మహేందర్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్యవైశ్యులు

గొల్లపల్లి : ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గొల్లపల్లి మండల కేంద్రంలో ఆర్యవైశ్యులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు అమలు చేమడంలో విఫలమైందని ఆరోపించారు. ఆర్యవైశ్య నిరుపేదలకు దళితబంధు, బీసీ బంధు తరహాలో పథకాన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం తమ డిమాండ్లకు స్పందించని పక్షంలో వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేసే ప్రసక్తే లేదని తెల్పి చెప్పారు. కార్యక్రమంలో రేణికుంట రాజేశం, పల్లెర్ల వీరేశం, సతీష్, శ్రీను, రమేష్, నాగరాజు, చంద్రశేఖర్, ప్రవీణ్, భాస్కర్,తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు అందజేత

కథలాపూర్: మండలంలోని పోతారంలో ముస్కెం సత్యనారాయణ ఇటీవలే మృతిచెందగా, బాధితకుటుంబానికి జగిత్యాల జిల్లా సహాయక బృందం సభ్యులు నిత్యావసర వస్తువులు ఆదివారం అందించారు. 25 కిలోల బియ్యం, 15 రకాల నిత్యావసర వస్తువులు, రూ. 1,000 నగదు అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు తాలుక మల్లేశ్, గుడూరి రాకేశ్, కల్లూరి మల్లేశ్, రాజేశ్, అశోక్, శంకర్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

మల్లాపూర్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో జగదీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి అర్హులైన వారు ఆధార్, రేషన్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రం, గృహ నిర్మాణానికి సంబంధించి స్థల పత్రాలు, బ్యాంక్ ఖాతా పాసుబుక్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, దరఖాస్తు ఫారంతో ఈ నెల 10లోగా ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

యువకుల శ్రమదానం

రాయికల్: పట్టణంలోని మూడో వార్డులో రోడ్లపై ఆదివారం యువకులు గుంతలు పూడ్చి శ్రమదానం చేశారు. పడకంటి గోపి, కుంబోజీదీపక్ అనే యువకులు రోడ్ల గుంతలు పూడ్చారు. అనంతరం కాలనీలో పిచ్చి మొక్కలను తొలగించారు. వీరిని కాలనీవాసులు అభినందించారు.

వాసవీమాతకు వాయినాలు, ఒడి బియ్యం

సారంగాపూర్: మండలంలోని పెంబట్ల శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం సారంగాపూర్, బీర్‌పూర్‌తో పాటు జిల్లా కేంద్రానికి చెందిన ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం, వాయినాలు సమర్పించారు. అధికమాసం, పురుషోత్తమ మాసం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించారు. అనంతరం సంఘ ప్రతినిధులు విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మర్యాల రాజన్న, యాసాల మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

'చలో కోరుట్ల' పోస్టర్ ఆవిష్కరణ

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్‌లో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో చలో కోరుట్ల పోస్టర్‌ను సంఘ నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ నెల 13వ తేదీన పద్మశాలీ రాజకీయ యుద్ధభేరి, ఆత్మగౌరవ సభను కోరుట్లలో నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే సభకు అన్ని జిల్లాల నుంచి పద్మశాలీ కులస్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలీ సంఘం కార్యవర్గ సభ్యుడు అంబల్ల సుదర్శన్, జిల్లా అధ్యక్షుడు రుద్ర సుధాకర్, అయిలాపూర్ అధ్యక్షుడు కటుకం గణేష్, నాయకులు జిల్లా ధనుంజయ, ఆనంద్, వేణు, లక్ష్మీనారాయణ, రాజేశ్ పాల్గొన్నారు.

మల్యాల: మండల కేంద్రంలో పద్మశాలీ సేవా సంఘం మండల అధ్యక్షుడు ముల్క మల్లయ్య ఆధ్వర్యంలో ఆదివారం రాజ్యాధికార సాధన కోసం చలో కోరుట్ల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, కస్తూరి విశ్వనాథం, బొమ్మకంటి గంగాధర్, కొండగబత్తిని గంగాధర్, గంగమల్లు, బొడ్డుల మహేందర్ పాల్గొన్నారు.

కొండపై లాక్‌రూం టెండర్ ఎప్పుడో?



కొండపై సిద్ధం చేసిన నూతన లాక్ రూం

కొండగట్టు: జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి వారి ఆలయంపై ఉన్న లాక్‌రూం (సామాను భద్రపరచు) గదికి ఆలయ అధికారులు టెండర్ నిర్వహించక పోవడంతో భక్తులు అవస్థలు పడుతున్నారు. మార్చి 31న లాక్ రూం టెండర్ ముగిసి, అధికారులు టెండర్ నిర్వహించినప్పటికీ సరైన ధర రాలేదనే కారణంతో ఫైనల్ చేయలేదు. దీంతో నిత్యం స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు వారి సామగ్రిని వెంట తీసుకోని రావడం సమస్యగా మారింది. దీంతో కొంతమంది దుకాణదారులు యాత్రికులు తీసుకువచ్చే సామగ్రిని దొంగచాటున భద్రపరచి వారి వద్ద డబ్బులు దండుకుంటున్నారు. పాత లాక్ రూం సరిగా లేదని నూతన లాక్ రూం గది సైతం సిద్ధం చేయగా, వినియోగంలో లేక అది కూడా మూలకు చేరింది. ఇప్పటికైనా అధికారులు టెండర్ నిర్వహించి లాక్‌రూం అందుబాటులోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు. దీనిపై ఆలయ ఈవో వెంకటేశ్‌ను వివరణ కోరగా దుకాణదారులు భక్తుల సామగ్రిని భద్రపరిచినట్లు తన దృష్టికి రాలేదని,ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో టెండర్ నిర్వహించి లాక్‌రూం అందుబాటులోకి తీసుకొచ్చి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు.

దొడ్డి కొమురయ్యపై చిత్ర నిర్మాణం



మాట్లాడుతున్న నాయకులు

జగిత్యాల: తెలంగాణ సాయుధ పోరాటంలో తొలిగా అమరుడు దొడ్డి కొమురయ్యపై చిత్రం నిర్మిస్తామని జిల్లాలోని అన్ని కులసంఘాలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పేర్కొన్నారు. జగిత్యాల పట్టణంలోని బీఎల్ మినీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం దొడ్డి కొమురయ్య సొసైటీ, దొడ్డి కొమురయ్య మూవీ నిర్మాణ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణలో ఉన్న వీరుల చరిత్రలు బయటకు రావాల్సిన అవసరం ఉందన్నారు. దొడ్డి కొమురయ్య చిత్రానికి అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సినిమా దర్శకుడు యం. సేనాపతి, పార్టీల ప్రతినిధులు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



పెంబట్ల అటవీప్రాంతంలో వేడుకలు

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పెంబట్ల–కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000–01 సంవత్సరం పూర్వ విద్యార్థులు పెంబట్ల అటవీప్రాంతంలో వేడుకలను జరుపుకుని, ఇప్పటి వరకు తమ బ్యాచ్‌లో తమతో చదివి ఆ కుటుంబాలు కష్టాల్లో ఉంటే వారిని ఆదుకున్న వివరాలను వెల్లడించారు. రానున్న రోజుల్లో స్నేహాన్ని బలంగా చేసుకోవడానికి సామాజిక సేవలను మరింత విస్తృత పరచాలని నిర్ణయించుకున్నారు.

కథలాపూర్: మండలకేంద్రంలోని మాస్టో స్కూల్‌లో ఆదివారం స్నేహితుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. స్నేహితులు అనే అంశంపై విద్యార్థులకు పాటల పోటీ నిర్వహించారు. స్నేహంగా ఉంటే కలిగే లాభాలను ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆకుల రంజిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా రవియాదవ్

రాయికల్: యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా రామాజీపేట గ్రామానికి చెందిన వాసరి రవియాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఆలూర్ గ్రామానికి చెందిన రాజన్న యాదవ్‌ను ఆదివారం సంఘ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కార్యక్రమంలో సంఘ నాయకులు వేల్పుల స్వామి యాదవ్, రాజలింగం యాదవ్, బర్కం మల్లేశ్‌యాదవ్, మల్లయ్య, మల్లారెడ్డి, రాజేశం,గంగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడిగా గంగాధర్

మల్లాపూర్: తెలంగాణ మాజీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా పాతదాంరాజుపల్లి గ్రామానికి చెందిన మామిడాల గంగాధర్‌ను నియమించినట్లు సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు దేవయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం గంగాధర్‌కు నియామక పత్రం అందజేశారు. మాజీ సర్పంచ్‌ల సంక్షేమం కోసం అహర్నిషలు పని చేయాలని గంగాధర్‌కు సూచించారు. మండల అధ్యక్షుడిగా నియమించిన బొడ్డు దేవయ్యకు గంగాధర్ కృతజ్ఞతలు తెలిపారు.

గద్దర్ మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటు

జగిత్యాల: గద్దర్ ఆకస్మిక మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటు అని టీపీసీసీ ఎస్‌ఆర్‌ఐ సెల్ కన్వీనర్ డా. షేక్‌చాంద్ పాషా అన్నారు. ఆదివారం గద్దర్ మృతి వార్త తెలియగానే పెద్దన్నతో ఉన్న తన అనుబంధాన్ని నెమరువేసుకున్నట్లు పేర్కొన్నారు.

గద్దర్ మృతిపై కాంగ్రెస్ పార్టీ సంతాపం

కథలాపూర్: ప్రజాగాయకుడు గద్దర్ మృతిపట్ల కథలాపూర్ మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం సంతాపం వ్యక్తం చేశారు. గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాయితి నాగరాజు, వెలిచాల సత్యనారాయణ, దొమ్మాటి అర్జున్, ప్రతాప్, రవి, వేణు తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్ 2002–03 సంవత్సరం విద్యార్థులు ఆదివారం స్థానిక సంగీత హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు, తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

అపూర్వ స్నేహితులకు సన్మానం

వెల్గటూర్: స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వెల్గటూర్ మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన అపూర్వ స్నేహితులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సిరిపురం తిరుపతి మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన పరకాల రమేశ్, సిరిపురం సతీశ్ చిన్నతనం నుంచి కలిసి చదువుకుని, ఇద్దరూ కలిసి వ్యాపారం ప్రారంభించి 20 ఏళ్లుగా ఎటువంటి బేధాభిప్రాయాలు లేకుండా వ్యాపారంతో పాటుగా తమ స్నేహాన్ని కొనసాగిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కోశాధికారి చంద్రమౌళి, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి మోటార్ వితరణ

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని శివ గాయత్రి అనాథ వృద్ధాశ్రమానికి పట్టణానికి చెందిన వ్యాపారి యంసాని సత్యనారాయణ–వసంత దంపతులు పాటు వారి కుమారుడు డాక్టర్ శ్రీకాంత్–స్వాతి దంపతులు రూ.17 వేల విలువగల విద్యుత్‌మోటర్, స్టార్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా దాతలను మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, ప్రసాద్, బాపురెడ్డి, సుదర్శన్, సత్తయ్య తదితరులు అభినందించారు.